

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 316 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 18, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# పదునెక్కని ప్రభుత్వ పనితీరు !




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





బ్రతికున్న ప్రాణాలతో వ్యాపారం
చేస్తున్న బడా కార్పొరేట్ వైద్యం

చనిపోయిన ప్రాణాలకు వైద్యం అందిస్తున్నట్లు నటిస్తున్నారు

కరోనా కన్నా భయంకరమైన పరిస్థితులు
తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పబడ్డాయి.?

ప్రజల ప్రాణాలకు విలువనివ్వని ప్రభుత్వ వైద్యశాలలు

ప్రభుత్వ వైద్యశాలలో పరికరాల కొరత

ప్రభుత్వ వైద్యాన్ని పట్టించుకునే నాధుడే లేడు

ప్రజల ప్రాణాలే కార్పొరేట్ ఆసుపత్రులకు
ఇన్వెస్ట్మెంట్ లాగా మారిపోతున్నాయి.....!

లేని జబ్బులను సృష్టించి వైద్యం చేస్తున్నారు

వైద్యం చిన్నది ఖర్చులు పెద్దవి

పేదల ప్రాణాలకు దిక్కేవరు
పేదల వైద్యానికి భరోసా ఎక్కడ

## ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతున్న కార్పొరేట్ వైద్యం




ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి. కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. చిన్న జబ్బులకు సైతం భారీ ఖర్చులు వసూలు చేస్తున్నారని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల కొరతను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య నిర్లక్ష్యం, అధిక ఫీజులు, అనవసర పరీక్షలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా పెంచి వైద్య చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేలా వైద్యరంగంలో సమూల మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

- హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

2






## ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత

వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

5



## బడుగు "జీవుల" ఆత్మగౌరవం" బడుగుల సుమతి

పేదలంటే ప్రాణం భావించే
మహిళ ఐపీఎస్ అధికారి

చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం తనకే సొంతం

మల్కాజిగిరి కమిషనరేట్ ను జాతీయస్థాయిలో తీర్చిదిద్దుతున్నారు

మహిళలకు విద్యార్థినిల రక్షకురాలుగా నిలుస్తూ దేశస్థాయిలో పేరుగాంచారు

ప్రజాసేవలో పట్టున్న ఐపీఎస్ అధికారిని

ప్రజాస్వామ్య విలువలకు పోలీస్ చట్టాలకు అత్యంత గౌరవాన్ని తెచ్చి పెడుతున్నారు

మల్కాజిగిరి కమిషనరేట్ ప్రజలకు దొరికిన అదృష్టవరం ఐపీఎస్ సుమతి రెడ్డి

ప్రథమ పోస్టు నుండి ప్రస్తుత పోస్టు వరకు తను నిర్వహిస్తున్న విధుల స్టైలే వేరు

ప్రభుత్వానికి గర్వాన్ని తెచ్చి పెడుతూ పేదల వైపు నిలుస్తున్నారు

క్లిష్ట కాలంలో పేదలకు సరళీకృత మార్గంలో పేదలకు సేవలందిస్తున్నారు : డాక్టర్ బరిగెల శివ

3



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**హనుమకొండ, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలతో జరుపుకునే ఈ పండుగ రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని ఆకాంక్షించారు.సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలకు కొనసాగాలని ఎంపీ కడియం కావ్య ఆకాంక్షించారు.

# యువత ఆరోగ్యంపై అవగాహనకు మారథాన్‌లు దోహదం

**క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి**
**మంత్రి శ్రీధర్ బాబు**
**ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ విజయవంతం వెనుక విష్ణువర్ధన్ రెడ్డి కృషి**
**వేలాది మంది రన్నర్లతో ఉత్సాహంగా రెండో ఎడిషన్**







**హనుమకొండ, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

యువత ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026 రెండో ఎడిషన్ ఉత్సాహంగా సాగింది. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం.. క్రీడలే ఆరోగ్యానికి పునాది**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. యువత శారీరక వ్యాయామం, క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. వ్యాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**మారథాన్ విజయవంతంలో విష్ణువర్ధన్ రెడ్డి కీలక కృషి**

ట్రై సిటీస్ హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి పలురోజులుగా శ్రమించి, ఏర్పాట్లలో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి అవసరమైన సమన్వయం, వివిధ వర్గాల సహకారం అందేలా కృషి చేశారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ఆయన కృషి, సహకారం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిర్వాహకులతో కలిసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయంగా నిలిచాయి.

**యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం**

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యువతను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించడం, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే మారథాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్యక్రమానికి మరింత స్పందన లభించడం సంతోషకరమన్నారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తినిచ్చే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రెడాయ్ ప్రతినిధులు, క్రీడా సంఘాల సభ్యులు, నిర్వాహకులు, స్పాన్సర్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రన్నర్లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పడునెక్కని ప్రభుత్వ వైద్యం

**ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతున్న కార్పొరేట్ వైద్యం**
**బ్రతికున్న ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న బడా కార్పొరేట్ వైద్యం**
**చనిపోయిన ప్రాణాలకు వైద్యం అందిస్తున్నట్లు నటిస్తున్నారు**
**కరోనా కన్నా భయంకరమైన పరిస్థితులు తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పబడ్డాయి.?**
**ప్రజల ప్రాణాలకు విలువనివ్వని ప్రభుత్వ వైద్యశాలలు**
**ప్రభుత్వ వైద్యశాలలో పరికరాల కొరత**
**ప్రభుత్వ వైద్యాన్ని పట్టించుకునే నాధుడే లేడు**
**ప్రజల ప్రాణాలే కార్పొరేట్ ఆసుపత్రులకు ఇన్వెస్ట్మెంట్ లాగా మారిపోతున్నాయి.....!**
**లేని జబ్బులను సృష్టించి వైద్యం చేస్తున్నారు**
**వైద్యం చిన్నది ఖర్చులు పెద్దవి**
**పేదల ప్రాణాలకు దిక్కేవరు పేదల వైద్యానికి భరోసా ఎక్కడ : డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

పేద ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్న కార్పొరేట్ వైద్యానికి ఆంక్షలుతో కూడిన చట్టాలను రూపొందించాలని డాక్టర్ల బరిగెల శివ డిమాండ్ చేశారు.తెలుగు రాష్ట్రాల్లో కరోనా కాలం కన్నా భయంకరమైన పరిస్థితులను నెలకొల్పి కార్పొరేట్ వైద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తున్నట్లు తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్ కార్పొరేట్ వైద్య దోపిడీ స్పష్టం చేస్తుందన్నారు.ప్రజల ప్రాణాలకు విలువనివ్వకుండా చిన్న వైద్యమైన పెద్ద మొత్తంలో డబ్బులు రాబట్టుకోవడం కోసం వైద్యాన్ని వ్యాపారంలో వాడుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రజల ప్రాణాలు అంటే లెక్కలేకుండా పోతుందని కార్పొరేట్ వైద్య ఆగడాలకు ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయలేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ వైద్య దోపిడీ పతాక స్థాయిలో పెరిగిపోయిందన్నారు.ప్రస్తుత కాల పరిస్థితులను గమనిస్తుండగా హాస్పిటల్స్ కు పోయిన ప్రాణాలు ఇంటికి తిరిగి వచ్చేలా కనిపించట్లేదని వాపోయారు.సాధారణ ప్రైవేట్ క్లినిక్ లలో కార్పోరేట్ వైద్యం కన్నా పెద్ద స్థాయిలో సంపూర్ణమైన వైద్యాన్ని చేసుకునే సౌకర్యాలు కల్పించబడుతూ సామాన్య క్లినిక్ వైద్యులు పేద ప్రజల ప్రాణాలకు అండగా నిలుస్తూ వాళ్ల ప్రాణాలను కాపాడుతున్నారని అభినందించారు.తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా ప్రభుత్వ వైద్యశాలలలో వైద్య సేవలకు సంబంధించిన పరికరాల కొరత స్పష్టంగా కనిపిస్తూ ఉండగా ప్రభుత్వ వైద్యం కాస్త ప్రైవేటు వైద్యం వైపు నెట్టివేయబడుతూ పేదలకు కాలానుకూలంగా వస్తున్న జబ్బులకు ప్రభుత్వ వైద్యశాలను దాటి ప్రైవేట్ వైద్యం చేయించుకోలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని బాధపడ్డారు.స్తోమతకు మించిన వైద్యం చేయించుకోలేని పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వ వైద్యశాలలు ఇరు రాష్ట్రాల్లో కొత్త కొత్త ప్రభుత్వ వైద్యశాలల భవనాలు పూర్తి చేయబడుతున్నప్పటికిని వైద్య సౌకర్యాలను అందుబాటులోనికి తీసుకురావడానికి సంవత్సరాల కాలం పాటు కాలయాపన చేస్తూ ప్రైవేటు వైద్యాన్ని పొంచి పోషించే రహస్య ఒప్పందాల కుట్రలను చేస్తున్నారంటూ హెచ్చరించారు.ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకనే ప్రైవేటు వైద్య సేవలు ఆగడాలను నిర్మూలించలేకపోతున్నారని నిలదీశారు.తెలుగు రాష్ట్రాల్లో ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్యమైన కార్పొరేట్ వైద్యమైన జిల్లా కలెక్టర్ల పరిధిలో వారు విధిస్తున్న ఆంక్షలు పాటిస్తూ ప్రభుత్వ ఆంక్షలుతో పాటు చట్టాలకు లోబడి వైద్యం అందించాల్సిన కార్పోరేట్ వైద్య సంస్థలు సామాన్యుని పాలిట శాపంగా మారి ధనికులకు దోస్తుగా మారుతూ వైద్య వ్యాపారం ముసుగులో వేల కోట్ల రూపాయలకు పరిగెడుతున్నారని గుర్తు చేశారు.ప్రతి జిల్లాలలోని కలెక్టర్లు ప్రైవేట్ వైద్యంపై విధించినటువంటి ఆంక్షలు అమలుపరచాలంటూ ఎన్నిసార్లు హెచ్చరించిన ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలలు రాజకీయ అండదండలతో, రక్షకభటుల అండదండలతో స్వతంత్ర అభివృద్ధిని సాధించుకుంటున్నారు తప్ప ప్రభుత్వం నియమాలకు లోబడి కలెక్టర్ల నియమాలకు లోబడి వైద్య చట్టాలకు లోబడి వైద్యశాలలను నడుపుకుందామనే ఆలోచనలకు రాలేకపోతున్నారని హెచ్చరించారు.

**దినదినం ప్రాణగండం..**

పేదల ప్రాణాలకు సరియైన వైద్యం అందించలేని ప్రభుత్వ వైద్య సిబ్బంది ప్రతి జిల్లాలలో ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలలు ఏర్పాటు చేసుకొని పేరుకే ప్రభుత్వ వైద్య అధికారిగా కొనసాగుతూ సమయం అంతా ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాలలో కేటాయిస్తూ వైద్య సేవలకు మచ్చ తెస్తున్నారని హెచ్చరించారు.ఎక్కడో కొంతమంది వైద్యాధికారులు పేద ప్రజల ప్రాణాలను కాపాడడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తూనే వాళ్ళు సొంతగా పెట్టుకున్న కార్పోరేట్ వైద్యశాలలో కూడా తక్కువ ఫీజులతో పేదలకు వైద్యాన్ని అందిస్తూ ప్రజాసేవకు ప్రజల ప్రాణాలకు కట్టుబడి వైద్య సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అని అలాంటి వైద్య సేవలు అందిస్తున్న అధికారులను కచ్చితంగా అభినందించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరికరాల లోపం వల్ల పేద ప్రజలు సరియైన వైద్యం చేసుకునే వెసులుబాటు లేక ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని అదే సందర్భంలో ప్రభుత్వాధికారులే మెరుగైన వైద్య సేవల కోసం ఫలానా వద్దకు వెళ్ళండి అంటూ ప్రైవేట్ వైద్యం వైపు పేదలను పంపించడం మరింత దారుణం అన్నారు.ప్రభుత్వ వైద్య రంగంలో నైపుణ్యంతో కూడిన వైద్య సేవలు అందించబడే విధంగా పట్టించుకునే నాధుడే లేకపోవడంతో పేద ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని హెచ్చరించారు.కరోనా సమయం కన్నా హాస్పిటల్స్ దోపిడి భయంకరంగా పెరిగిపోవడంతో చిన్న వైద్యానికి పెద్ద ఖర్చులు అంటూ పేద ప్రజలు బెంబలెత్తిపోతుండగా హాస్పిటల్ కి పోయిన ప్రాణాలు తిరిగి ఇండ్లలోనికి వచ్చే పరిస్థితి లేక అంధకార జీవితాన్ని అనుభవిస్తున్నారని గుర్తు చేశారు.ఏ ప్రాంతంలో చూసిన ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వ హాస్పిటల్స్ మెడికల్ మాఫియాలు ఒక్కటైపోయి వైద్య దోపిడీకి పాల్పడుతున్నారని అదే సందర్భంలో ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతూ పైసా వ్యాపారాలు చేస్తున్నారని హెచ్చరించారు.కాలం చెల్లిన మందులను మెడికల్ మాఫియా సరఫరా చేస్తున్నప్పటికీ డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద స్థాయి కార్పొరేట్ వైద్యశాలలు విచ్చలవిడిగా వైద్య వ్యాపారానికి పాల్పడుతున్నారని హెచ్చరించారు.డ్రగ్ కంట్రోల్ అధికారులు పెద్ద ఎత్తున అమ్ముడుపోతుండడంతో మెడికల్ మాఫియా రెచ్చిపోతూ ప్రజల ప్రాణాలను లెక్కచేయడం లేదని తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లో వైద్య చట్టాలు కఠినంగా ఉంటున్నప్పటికి వైద్య రూల్స్ కు విరుద్ధంగా పేషెంట్స్ డీటెయిల్స్ రాసుకుంటూ చిన్న జబ్బును పెద్ద జబ్బుగా చూపిస్తూ ప్రాణాలు తీస్తున్నారని హెచ్చరించారు.వైద్య సేవల కోసం వచ్చిన ప్రతి ఒక్కరిని సీసీ కెమెరాలలో బంధిస్తూ లిఖితపూర్వకంగా రాయించుకుంటూ వైద్యాలు చేస్తూ ప్రజల ప్రాణాలకు లెక్క లేకుండా చేస్తున్నారని హెచ్చరించారు. నేటి దినాల్లో ఎక్కడ చూసిన నిత్యం హాస్పిటల్స్ లో ప్రాణాలు పోతున్న పరిస్థితిలే కనిపిస్తున్నాయి తప్ప వైద్యం అందించబడి ప్రాణాలు కాపాడుకుంటున్న శాతం పూర్తిగా తగ్గిపోతుందని గుర్తు చేశారు.కరోనా తర్వాత మరణాల సంఖ్య తగ్గిపోవాల్సి ఉంటుండగా కరోనా సమయంలో కన్నా పై స్థాయిలో ప్రజల ప్రాణాలు పోతుండడం కార్పొరేట్ వైద్యం ఆగడాలకు అవధులు లేకుండా పోతున్నాయని హెచ్చరించారు.

**కార్పొరేట్ వైద్యానికి కొమ్ముకాస్తున్నారు..**

ప్రజల ప్రాణాలు అంటే లెక్కచేయని ప్రైవేట్ కార్పొరేట్ వైద్య సంస్థలు ప్రజల ప్రాణాలను అకారణంగా తీస్తున్నప్పటికిని ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేని పరిస్థితుల్లో ఉంటుండగా ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్య రంగ సంస్థలు ప్రజల ప్రాణాలను అకారణంగా తీస్తుంటే వాటిని ప్రశ్నిస్తున్న వ్యక్తులపై పోరాటాలు చేస్తున్న ప్రజాసంఘాలపై పోలీసులచే అణిచివేతకు గురిచేస్తూ అక్రమంగా కేసులు బనాయిస్తూ ప్రైవేటు వైద్య మాఫియా రంగాన్ని బలోపేతం చేసుకుంటున్నారని హెచ్చరించారు.చట్టాలంటే భయం లేకుండా న్యాయస్థానాలు అంటే లెక్క లేకుండా ప్రభుత్వాల అండతో రెచ్చిపోతున్న ప్రైవేటు వైద్య మాఫియా దందాను నిర్మూలించకపోతే తెలుగు రాష్ట్రాల్లో పేద ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లేనంటూ గుర్తు చేశారు.ప్రజలు తినే ఆహారం నుండి ప్రజలు వేసుకునే వైద్య మందుల వరకు కార్పొరేట్ సంస్థలే గుప్పిట్లో పెట్టుకుని ఫుడ్ ఇన్స్పెక్టర్లు డ్రగ్ ఇన్స్పెక్టర్లను మచ్చిక చేసుకుంటూ ప్రజల ప్రాణాలతో వ్యాపారాలు చేస్తున్నారని మొత్తం మీదుగా కార్పొరేట్ వైద్యం కళకళలాడడానికి పేద ప్రజల ప్రాణాలు బలికొనాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.ప్రతి ప్రాంతంలో వైద్య వ్యాపారానికి హద్దులు లేకుండా పోతుండగా వాళ్లకు రక్షణగా నిలుస్తున్న ప్రభుత్వ సంస్థలు పేద వైద్యాన్ని అణిచివేసే ప్రయత్నం చేస్తూ ప్రభుత్వ వైద్యం,కార్పొరేట్ వైద్యం రెండూను పేద ప్రజలకు అందకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నారని హెచ్చరించారు. రెక్కాడితే డొక్కాడని పేద ప్రజలు వాళ్ల జీవితాలను వాళ్ల ప్రాణాలను కాపాడుకోవడానికి చిన్నపాటి వైద్యానికి ఎంతో గాబర పడుతున్నటువంటి సందర్భాల్లో పెద్ద ఖర్చులతో కూడిన వైద్యాన్ని చేయించుకోవాల్సిన పరిస్థితులు లెక్కలేనంతగా ఎదురవుతున్నప్పటికిని వాళ్ళ ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వలేని వైద్యాన్ని నమ్ముకుంటూ కార్పొరేట్ వైద్య అరాచకాల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు.గతంలో ఠాగూర్ సినిమా తరహాలో మెడికల్ హాస్పిటల్స్ మెడికల్ మాఫియా ఒక్కటై కార్పొరేట్ వైద్యం అందిస్తామంటూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ప్రతి హాస్పిటల్స్ సిబ్బంది దోచుకున్నోనికి దోచుకున్నంతగా వ్యవహరిస్తూ తెలుగు రాష్ట్రాల ఆరోగ్య శాఖలను భ్రష్టుపట్టిస్తున్నారని నిలదీశారు.తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నావా లేవా అనే విధంగా ప్రైవేట్ హాస్పిటల్స్ ను పెంచి పోషిస్తున్నట్లు కనిపిస్తుందని హెచ్చరిస్తూ ప్రైవేటు కార్పొరేట్ వైద్యశాలలో పెరిగిపోతున్న మరణాల సంఖ్య పై రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విచారణ చేస్తూ ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు.నిర్లక్ష్యపు ధోరణితో ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్న కార్పొరేట్ వైద్యశాలలను ఉన్న పాటుగా మూసివేయాలని డిమాండ్ చేశారు.హాస్పిటల్స్ రికార్డులలో నమోదు చేయబడుతున్న మరణాల సంఖ్య ఆధారంగా చర్యలు చేపట్టాలని కోరారు.కల్తీ ఆహారాలతో కల్తీ మందులతో కల్తీ వైద్యంతో కల్తీ వైద్య మాఫియాతో తెలుగు ప్రజలకు రక్షణ లేకుండా తెలుగు ప్రజల ప్రాణాలకు భరోసా లేకుండా పోతుంది అనేది మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.ప్రజల ప్రాణాలకు పెద్ద ఎత్తున ప్రమాదాలు సంభవిస్తున్నప్పటికిని ప్రభుత్వాలు జడియపాటు చర్యలు తీసుకోకపోవడం పైగా కార్పొరేట్ వైద్యానికి రక్షణ కవచాలుగా పోలీసు వ్యవస్థను అండగా పెట్టడం తెలుగు ప్రజల దౌర్భాగ్యం అని పేర్కొన్నారు.ప్రతి కార్పొరేట్ వైద్యులు ఆస్తుల సంపాదనలో మృతి ధర్మంతో పాటు,మానవ ధర్మాన్ని,ఆత్మగౌరవం అమ్ముకుంటున్నారంటూ హెచ్చరిస్తూ వైద్యాన్ని కేవలం పైనసంపాదనకు మాత్రమే ఉపయోగించుకునే పరిస్థితిని నెలకొల్పుతున్నారని అది భవిష్యత్ తరానికి ఏమాత్రం మంచిది కాదంటూ హెచ్చరిస్తూ పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు సంపన్నులు వైద్య సేవలను పొందుకునే క్రమంలో ప్రభుత్వ వైద్యం గాని,ప్రైవేటు వైద్యం గాని కార్పొరేట్ వైద్యం గాని సరి సమానమైన పద్ధతిలో చట్టం పద్ధతిలో వైద్య సేవలు అందుబాటులోనికి రావడానికి ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్యశాఖలు కట్టుదిట్టమైన చట్టాన్ని తీసుకొచ్చి ఉక్కుపాదం మోపితే తప్ప తెలుగు ప్రజల ప్రాణాలకు కార్పొరేట్ వైద్యశాలలు విలువనిచ్చే పరిస్థితి లేదని స్పష్టంగా తేలిపోతుందన్నారు.

# దుర్గామాత ఆశీస్సులు తీసుకున్న రాజనాల శ్రీహరి

**భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్**





**వరంగల్, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాతకు గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కార్యవర్గ సభ్యులు కార్తీక్ గౌడ్, అజ్జు భాయ్, కోమల్ గౌడ్, అరుణ్ గౌడ్, బన్నీ, సన్నీతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# బడుగు “జీవుల ఆత్మగౌరవం” బడుగుల సుమతి

**పేదలంటే ప్రాణం భావించే మహిళ ఐపీఎస్ అధికారి.**
**చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం తనకే సొంతం.**
**మల్కాజిగిరి కమిషనరేట్ ను జాతీయస్థాయిలో తీర్చిదిద్దుతున్నారు.**
**మహిళలకు విద్యార్థినిల రక్షకురాలుగా నిలుస్తూ దేశస్థాయిలో పేరుగాంచారు.**
**ప్రజాసేవలో పట్టున్న ఐపీఎస్ అధికారిని.**
**ప్రజాస్వామ్య విలువలకు పోలీస్ చట్టాలకు అత్యంత గౌరవాన్ని తెచ్చి పెడుతున్నారు.**
**మల్కాజిగిరి కమిషనరేట్ ప్రజలకు దొరికిన అదృష్టవరం ఐపీఎస్ సుమతి రెడ్డి.**
**ప్రథమ పోస్టు నుండి ప్రస్తుత పోస్టు వరకు తను నిర్వహిస్తున్న విధుల స్టైలే వేరు.**
**ప్రభుత్వానికి గర్వాన్ని తెచ్చి పెడుతూ పేదల వైపు నిలుస్తున్నారు.**
**క్లిష్ట కాలంలో పేదలకు సరళీకృత మార్గంలో పేదలకు సేవలందిస్తున్నారు.**
**డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

ఎంత ఎదిగిన పేద ప్రజలకు అండగా నిలవడంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి రెడ్డి ఐపీఎస్ ప్రత్యేకతను ప్రతినిత్యం కొనియాడదగే విధంగా ఉంటుందని డాక్టర్ బరిగెల శివ గర్వంగా చెప్పారు. శనివారం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో సిపి సుమతి రెడ్డి,ఎస్బి డిసిపి నరసింహారెడ్డి గార్లను మర్యాదపూర్వకంగా కలిసిన జై భీమ్ సంస్థల చైర్మన్ వారి సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ అధికార పదవితో కూడిన విధులను నిర్వహించడంలో సిపి సుమతి రెడ్డి తన ప్రత్యేకతను ప్రతి చోట చాటుకుంటున్నారని అభినందించారు. ప్రస్తుత భారత దేశంలో పేద ప్రజలు అంటే లెక్క లేకుండా ఉంటున్న ప్రభుత్వ ఉన్నత అధికారులు కోకొల్లలం కలరని అలాంటి ఉన్నత అధికారులు అంతా ఒక్కసారిగా మల్కాజిగిరి సిపి నిర్వహిస్తున్న సేవలను లోతైన స్థాయిలో ఆస్వాదించుకొని పేద ప్రజల పక్షాన నిలబడాల్సిందిగా సూచించారు. కుటుంబ నేపథ్యం మొదలుకొని వ్యక్తిగత జీవిత నేపథ్యం మొదలుకొని చిన్ననాటి నుండే కృషి పట్టుదలతో పేద ప్రజల సేవలువైపు అడుగులు వేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే కాకుండా ఎంత ఎదిగిన పేద ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పాన్ని మాత్రం వదులుకోకుండా మహిళలకు,విద్యార్థినీలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వాళ్ల ప్రాణాలకు రక్షణగా నిలుస్తుండడమే కాకుండా రాజకీయ ఎత్తు పల్లాలతో కూడిన సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తూ, పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి మార్గాలను చూపిస్తున్న ఉత్తమ సీపిగా పేరుగాంచుతున్నారని అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిఘా విభాగం అనేది అత్యంత ప్రామాణికమని అందులో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సమాజ రక్షణ బాధ్యతనే కాకుండా,ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పోలీస్ చట్టాలకు రక్షణగా నిలిచే బాధ్యతను మోస్తున్నారని అలాంటి బాధ్యతను మోస్తున్న మల్కాజిగిరి ఎస్బి డీసీపీ నరసింహారెడ్డిని మనస్ఫూర్తిగా అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్బి విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు వ్యక్తిగత జీవితాలతో పాటు వృత్తిపరమైన అధికారాల్లో ఎలాంటి మచ్చలేనివారుగా ఉండాలన్నది తన అభిప్రాయం అని పేర్కొంటూ రాజకీయాలకు రాజకీయ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలకు అధికారుల ప్రలోభాలకు అనుకూలమైన అధికారులను నిఘావిభాగాల్లో ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదని తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అద్భుతమైన సేవలు అందించగలమనే భరోసా కల్పింస్తూ అద్భుతమైన సేవలకు ఉదాహరణగా నిలుస్తున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ను ఆదర్శంగా తీసుకోవాలంటూ పేర్కొన్నారు. మల్కాజిగిరి సీపి ప్రజాసేవకు ఒక ప్రత్యేకమైన ఆదర్శంగా నిలుస్తున్నారని వారి సేవలను ఆస్వాదిస్తున్న మల్కాజిగిరి ప్రజలు అదృష్టవంతులు అంటూ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను,పేద ప్రజల ప్రాణాలకు భరోసనిస్తూ రక్షణగా నిలుస్తున్న ఐపీఎస్ సుమతి రెడ్డి లాంటి అధికారిని బడుగు జీవుల రక్షణ కోసమే జన్మించినట్లుగా పేద ప్రజలు వాళ్ళ ఆత్మగౌరవాన్ని సిపి “బడుగుల” రూపంలో బలపరచుకుంటున్నారని అన్నారు.



## ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకున్న యువకుడికి ఎమ్మెల్యే పరామర్శ





**వర్ధన్నపేట,17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇల్లంద గ్రామానికి చెందిన కార్తిక్‌కు ఆర్థిక సహాయం అందించి, మెరుగైన వైద్యం పొందేలా చొరవ తీసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తాజాగా కోలుకుని ఇంటికి చేరిన యువకుడిని పరామర్శించారు. మంద మల్లేశం--రాధిక దంపతుల కుమారుడైన కార్తిక్ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. వైద్యంతో కోలుకుని ఇంటికి చేరిన కార్తిక్‌ను పరామర్శించి, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటానని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కార్తిక్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోశాల వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ బుచ్చిమల్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్‌లో అసంతృప్తి?

**సర్వోత్తమ్ రెడ్డి రాజకీయ నేపథ్యం**
**ఆశావహుల్లో ఆందోళనపై చర్చ**
**పట్టభద్రుల ఓటరు నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయమే కీలకం**
**అభ్యర్థి ఎంపిక నుంచి గెలుపు వ్యూహం వరకు కాంగ్రెస్‌కు పరీక్ష**

**వరంగల్,17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేయడంతో ఎన్నికల సమీకరణాలపై చర్చ మొదలైంది. అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించిన ఇతర నాయకుల పరిస్థితి, పార్టీ అంతర్గత సమన్వయం, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం, పట్టభద్రుల ఓటరు నమోదు వంటి అంశాలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అభ్యర్థి ఎంపికతో రాజకీయంగా ఒక కీలక దశ ముగిసినా, ఎన్నికల నాటికి పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించడం, ప్రజా సమస్యలపై స్పష్టమైన కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడం కాంగ్రెస్‌కు ప్రధాన సవాళ్లుగా కనిపిస్తున్నాయి.

### రాజకీయ వారసత్వమే బలమా?

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాజీ మంత్రి, దివంగత కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు. దామోదర్ రెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లాలో, ముఖ్యంగా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో రాజకీయంగా గుర్తింపు పొందిన నాయకుడు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. ఈ నేపథ్యంలో సర్వోత్తమ్ రెడ్డికి పార్టీ అభ్యర్థిత్వం దక్కడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, కుటుంబ రాజకీయ నేపథ్యం ఒక్కటే పట్టభద్రుల ఎన్నికల్లో విజయానికి సరిపోతుందా? విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అభ్యర్థి తన వైఖరిని ఎంత స్పష్టంగా వెల్లడిస్తారు? మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రులతో ఎంత విస్తృతంగా సంబంధాలు ఏర్పరచుకుంటారు? అన్నది కీలకం కానుంది.

### టికెట్ ఆశావహుల్లో అసంతృప్తి ఉందా?

సెప్టెంబర్ 29న కాంగ్రెస్ అధిష్ఠానం సర్వోత్తమ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. అంతకుముందు ఈ స్థానం కోసం పలువురు పార్టీ నాయకుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. దీంతో అభ్యర్థిత్వంపై ఆశలు పెట్టుకున్న నాయకులకు పార్టీ నిర్ణయం ఎలా ఆమోదయోగ్యమవుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. అయితే, అభ్యర్థి ఎంపికపై ఎంతమంది నాయకులు అసంతృప్తితో ఉన్నారు? ఆ అసంతృప్తి పార్టీ ఎన్నికల ప్రచారంపై ప్రభావం చూపుతోందా? అన్న అంశాలపై స్పష్టమైన అధికారిక సమాచారం అవసరం. అసంతృప్తి ఉందనే ప్రచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని పార్టీ అంతర్గత విభేదాలపై తుది నిర్ధారణకు రావడం సరికాదు. టికెట్ ఆశించిన నాయకులకు పార్టీ నాయకత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుంది? అభ్యర్థి గెలుపు కోసం వారిని ఏ విధంగా సమన్వయం చేస్తుంది? అన్నది రానున్న రోజుల్లో కీలకం కానుంది.



### సామాజిక సమీకరణాలపై చర్చ

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కూడా చర్చకు వస్తోంది. బీసీ, మైనారిటీ తదితర వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించాలనే అభిప్రాయాలు కొన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారు? వివిధ వర్గాల నాయకుల అభిప్రాయాలను పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుందా? అన్న అంశాలపై అధికారిక వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది. పార్టీ నిర్ణయాన్ని సామాజిక వర్గాల ప్రాతినిధ్యంతో ముడిపెట్టి అంచనా వేయడం కంటే, అభ్యర్థి సామర్థ్యం, పట్టభద్రులతో సంబంధాలు, పార్టీ యంత్రాంగం సమన్వయం, ప్రజా సమస్యలపై కార్యాచరణ వంటి అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### ఎన్నికల సన్నద్ధతపై కాంగ్రెస్ దృష్టి

అక్టోబర్ 7న జరిగిన మీటింగ్ ప్రకారం, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతలో కాంగ్రెస్ పార్టీకి ఓటరు నమోదు, పార్టీ నాయకులు--కార్యకర్తల సమన్వయం, ప్రచార కార్యక్రమాల ప్రారంభం వంటి అంశాలు సవాళ్లుగా మారాయి. అభ్యర్థి పోటీపై ఆసక్తి చూపడం లేదంటూ తొలుత ప్రచారం జరిగినప్పటికీ, దానికి సంబంధించి అధికారిక నిర్ధారణను వేరుగా పరిశీలించాల్సి ఉంది. అక్టోబర్ 10న ఖమ్మంలో జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు కూడా ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామాలు చూస్తే, అభ్యర్థి ఎంపికతో పాటు ఓటరు నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పార్టీ శ్రేణుల సమన్వయంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.

### పట్టభద్రుల ఓటరు నమోదే కీలక ఘట్టం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎవరన్నదానితో పాటు అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావడం కూడా అత్యంత కీలకం. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా సిద్ధం కావడానికి ముందే అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించడం, దరఖాస్తుల ప్రక్రియపై సమాచారం అందించడం రాజకీయ పార్టీలకు ముఖ్యమైన పనిగా మారింది. కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికే ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించింది. అయితే, మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎంతమంది అర్హులైన పట్టభద్రులను గుర్తించారు? వారిలో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? మండలాలు, పట్టణాల వారీగా నమోదు కార్యక్రమం ఎంతవరకు సాగుతోంది? అన్న అంశాలపై తాజా గణాంకాలు అందుబాటులోకి వస్తే ఎన్నికల సన్నద్ధతపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### పట్టభద్రుల సమస్యలపై అభ్యర్థి కార్యాచరణ ఏది?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ రాజకీయ ప్రచారానికి మాత్రమే పరిమితం కావు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ నోటిఫికేషన్లు, విద్యారంగంలో మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాల సమస్యలు, ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు, ఉద్యోగుల హక్కులు వంటి అంశాలు పట్టభద్రులకు ప్రాధాన్యంగా ఉంటాయి. ఈ సమస్యలపై సర్వోత్తమ్ రెడ్డి ఎలాంటి ప్రణాళికను రూపొందిస్తారు? పట్టభద్రులతో నేరుగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరిస్తారా? ఎన్నికల సందర్భంగా ఇచ్చే హామీలకు అమలు సాధ్యాసాధ్యాలను ఎలా వివరిస్తారు? అన్నది ఓటర్లలో ఆసక్తి రేకెత్తించే అంశం. కుటుంబ రాజకీయ నేపథ్యం, పార్టీ మద్దతు అభ్యర్థికి గుర్తింపు తీసుకురావచ్చు. కానీ పట్టభద్రుల సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం, స్పష్టమైన కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబాటు వంటి అంశాలు కూడా అభ్యర్థి రాజకీయ ప్రస్థానంలో ప్రాధాన్యం పొందనున్నాయి.

### కాంగ్రెస్ నాయకత్వం ముందున్న ప్రశ్నలు

సర్వోత్తమ్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం ముందు పలు ప్రశ్నలు నిలుస్తున్నాయి. టికెట్ ఆశించిన నాయకులను ఎన్నికల ప్రక్రియలో ఎలా భాగస్వాములను చేస్తారు? సామాజిక వర్గాల నుంచి వస్తున్న అభిప్రాయాలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారు? ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏ స్థాయిలో పర్యవేక్షిస్తారు? పట్టభద్రుల సమస్యలపై అభ్యర్థి కార్యాచరణను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తారు ఈ ప్రశ్నలకు పార్టీ నాయకత్వం, అభ్యర్థి చేపట్టే చర్యల ద్వారా సమాధానాలు లభించాల్సి ఉంది. ఎన్నికల ప్రచారం ప్రారంభ దశలోనే సంస్థాగత సమన్వయం, ఓటరు నమోదు, ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరి వంటి అంశాలపై దృష్టి సారించడం అవసరం. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కడం వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పరిణామం. అయితే, అభ్యర్థి ఎంపిక ఒక్కటే ఎన్నికల సన్నద్ధతకు కొలమానం కాదు. పార్టీ శ్రేణుల సమన్వయం, అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, సామాజిక వర్గాల అభిప్రాయాలకు ప్రాధాన్యం, విద్యావంతులు-నిరుద్యోగుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ వంటి అంశాలే తదుపరి రాజకీయ చర్చకు కేంద్రంగా మారనున్నాయి. అభ్యర్థి ఎంపికపై వస్తున్న అసంతృప్తి ప్రచారానికి పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుంది? ఓటరు నమోదు కార్యక్రమం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ముందుకు సాగుతోంది? పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి సర్వోత్తమ్ రెడ్డి ఎలాంటి కార్యాచరణను ప్రకటిస్తారు? ఈ అంశాలపై అధికారిక సమాచారం, తాజా గణాంకాలు వెలువడితే ఎన్నికల సన్నద్ధతపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్ సత్య శారద





**వరంగల్, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును, వరంగల్ జిల్లా జడ్జి బి.వి. నిర్మలా గీతాంబను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరికీ పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# నిమ్స్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి**
**నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్**





**హైదరాబాద్, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇటువంటి వేడుకలు సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ఉద్యోగుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నిమ్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. మహిళా ఉద్యోగుల ఉత్సాహంతో కార్యక్రమ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డాక్టర్ మార్తా రమేష్ సత్యగౌడ్, ఎం. రాజ్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, రాధిక, కనకతార, ఆశలత, సౌజన్య, గోవర్ధన్, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వైద్య, నర్సింగ్ సిబ్బంది, ఎంహెచ్ఎం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 24 అంతస్తుల ఆస్పత్రి.. 2,200 పడకలు!

**భవనం సిద్ధమైతే సరిపోతుందా?**
**వైద్యులు, పరికరాలు, నిధులు, నిర్వహణపై సందేహాలెన్నో..**
**పేదలకు నాణ్యమైన వైద్యం అందేనా?**



**వరంగల్, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉత్తర తెలంగాణ వైద్యరంగంలో కీలక ప్రాజెక్టుగా నిలుస్తోంది. సుమారు 2,200 పడకల సామర్థ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వరంగల్‌తోపాటు ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, భారీ భవనం నిర్మించడం ఒక ఎత్తయితే.. అందులో నిరంతరాయంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడం మరో ఎత్తు. ఈ నేపథ్యంలో వైద్యుల నియామకాలు, పరికరాల నిర్వహణ, నిధుల కేటాయింపు, రోగులకు కల్పించే సదుపాయాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వైద్యుల బలం ఎంత?**

2,200 పడకలకు అనుగుణంగా స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా? ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి? ఎన్ని భర్తీ చేశారు? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయి? అన్న వివరాలను వైద్యశాఖ వెల్లడించాల్సి ఉంది. వైద్యులు, సిబ్బంది కొరత ఉంటే అత్యాధునిక సదుపాయాలున్నా రోగులకు పూర్తిస్థాయి సేవలు అందించడం కష్టమే. ముఖ్యంగా అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు 24 గంటలూ పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు అవసరం.

**పరికరాల కొనుగోలేనా.. నిర్వహణకు నిధులున్నాయా?**

ఎంఆర్ఐ, సీటీ స్కాన్, క్యాథ్ ల్యాబ్, వెంటిలేటర్లు, డయాలసిస్ యంత్రాలు వంటి ఆధునిక పరికరాల కొనుగోలుతోనే బాధ్యత పూర్తికాదు. వాటి నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సిబ్బంది కోసం ప్రత్యేక నిధులు కేటాయించారా? పరికరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేసే వ్యవస్థ ఉందా? గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరికరాల నిర్వహణపై తలెత్తిన సమస్యలు కొత్త ఆస్పత్రిలో పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్నది కీలకంగా మారింది.

**నిర్వహణ వ్యయం ఎంత?**

ఆస్పత్రి నిర్మాణానికి భారీగా ప్రజాధనం వెచ్చిస్తున్న నేపథ్యంలో, ప్రారంభమైన తర్వాత ఏటా ఎంత నిర్వహణ వ్యయం అవసరమవుతుందన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. వైద్యులు, సిబ్బంది జీతాలు, మందుల కొనుగోలు, విద్యుత్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పరికరాల మరమ్మతులు, భవన నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం నిరంతరాయంగా విడుదల చేస్తుందా? నిధుల కొరతతో వైద్యసేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యేక బడ్జెట్ సిద్ధం చేశారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

**రోజుకు వేలాది మంది వస్తే సౌకర్యాలు సరిపోతాయా?**

కొత్త ఆస్పత్రికి వరంగల్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కౌంటర్లు, పరీక్షల విభాగాలు, ఫార్మసీ, రోగుల నిరీక్షణ ప్రాంతాలు, పార్కింగ్ సదుపాయాలు కీలకంగా మారనున్నాయి. అంబులెన్సులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారా? వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారా? అన్నది పరిశీలించాల్సి ఉంది.

**భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయా?**

24 అంతస్తుల భవనంలో అగ్నిమాపక వ్యవస్థ, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, విద్యుత్ బ్యాకప్, ఆక్సిజన్ సరఫరా, లిఫ్టుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. అగ్నిమాపక శాఖ అనుమతులు పొందారా? అత్యవసర పరిస్థితుల్లో రోగులను సురక్షితంగా తరలించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చారా? అన్న వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

**పేదలకు నాణ్యమైన వైద్యం అందేనా?**

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందడం అత్యంత ముఖ్యం. ఆరోగ్యశ్రీతోపాటు ఇతర ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద ఏయే చికిత్సలు అందుబాటులో ఉంటాయి? అవసరమైన మందులు, వైద్య పరీక్షలు నిరంతరాయంగా అందిస్తారా? రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు రాకుండా ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది? ఆస్పత్రి నిర్వహణలో ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగిస్తే వాటి పనితీరును ఎవరు పర్యవేక్షిస్తారు? అన్న అంశాలపై స్పష్టత అవసరం.

**పాత ఎంజీఎం నుంచి మార్పిడి ఎలా?**

పాత ఎంజీఎం నుంచి వైద్య విభాగాలను కొత్త ఆస్పత్రికి తరలించే సమయంలో అత్యవసర సేవలు, ఐసీయూలు, శస్త్రచికిత్సలు, ప్రయోగశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చూడాలి. ఏ విభాగాన్ని ఎప్పుడు తరలిస్తారు? కొత్త ఆస్పత్రిలో వైద్యులు, పరికరాలు సిద్ధమైన తర్వాతే సేవలను మారుస్తారా? రోగులు రెండు ఆస్పత్రుల మధ్య తిరగాల్సిన పరిస్థితి రాకుండా ఎలాంటి ప్రణాళిక రూపొందించారు? అన్నది కీలకంగా మారింది.

**అధికారుల వివరణ అవసరం**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉత్తర తెలంగాణ ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న కీలక ప్రాజెక్టు. అయితే, భవనం నిర్మాణం, పడకల సంఖ్యతోపాటు వైద్యులు, పరికరాలు, మందులు, నిర్వహణ నిధులు, రోగుల భద్రతపై కూడా సమగ్ర దృష్టి అవసరం. 2,200 పడకలకు సరిపడా వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారా? పరికరాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించారా? పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఎలాంటి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు? ఈ అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ, ఆస్పత్రి నిర్మాణ అధికారులు, జిల్లా యంత్రాంగం సమగ్ర వివరాలు వెల్లడించాలి. కొత్త ఆస్పత్రి కేవలం భారీ భవనంగా కాకుండా పేదలకు నమ్మకమైన వైద్యసేవల కేంద్రంగా నిలవాలంటే ఈ సందేహాలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

– హన్మకొండ శ్రీకాంత్, అధికార ప్రతినిధి, జై భీమ్ న్యూస్



# ఎన్పీయే కార్యక్రమానికి హాజరయిన డీజీపీ అనంద్

**హైదరాబాద్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

శనివారం నేషనల్ పోలీస్ అకాడమిలో జరిగిన 78వ బ్యాచ్ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్కు రాష్ట్ర డీజీపీ సివి అనంద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని, పరేడ్ను సమీక్షించి, శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. డీజీపీ మాట్లాడుతూ నేషనల్ పోలీస్ అకాడమీ హైదరాబాద్లోనే ఉండటంతో, తెలంగాణ పోలీసులకు, అకాడమీకి దశాబ్దాలుగా పరస్పర సమన్వయంతో కూడిన సత్సంబంధాలు కొనసాగుతున్నాయి. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ పరేడ్, శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులకు ఎంతో ప్రత్యేకమైన రోజు. శిక్షణ ముగించుకుని విస్తృతమైన ప్రపంచంలోకి అడుగుపెడుతున్న వారికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయని అన్నారు.

# 66మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**చిట్వేలి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

చిట్వేలి మండల కేంద్రము లోని మందుల దుకాణాల్లో తిరుపతి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రుతు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మందుల దుకాణాల్లో ఔషధాల నిల్వలు, విక్రయ విధానం, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో మాత్రమే విక్రయించాల్సిన మందులను నిబంధనల ప్రకారం విక్రయించాలని, గడువు ముగిసిన మందులను విక్రయించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మత్తు ప్రభావం కలిగిన ఎన్ఆర్ఎక్స్ మందులు, ప్రెగ్నెన్సీ కిట్లు ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టి పరిస్థితిలోనూ విక్రయించరాదు అని స్పష్టం చేశారు. గడువు తీరిన మందులు, ఫిజీషియన్ శాంపిల్స్ షాపులలో ఉండకూడదని తెలియజేశారు. ఔషధాల విక్రయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరించకూడదని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే మందుల దుకాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా, ఔషధాల విక్రయంలో అక్రమాలకు తావులేకుండా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ కె. రఘు నామినేషన్ దాఖలు

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

ఎమ్మిగనూరు పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ కె. రఘు నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బనవాసి బసి రెడ్డి అధ్యక్షతన నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. రఘు మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి, మాజీ ఎమ్మెల్యే కే. చెన్నకేశవ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు రెండోసారి సేవ చేసే అవకాశం కల్పించినందుకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆశీర్వాదాలు తనపై ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మిగనూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, ప్రజల సమస్యలను పరిష్కరించి పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డాక్టర్ కె. రఘు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని పట్టణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు..

# పురిటి నొప్పులతో పోరాడి జన్మనిచ్చిన తల్లి.. నాలుగు మెతుకుల కోసం మీ గుమ్మం ముందు నిలబడాలా?

**కడుపులో తొమ్మిది నెలలు మోసి.... కష్టపడి పెంచిన తల్లి చివరకు అన్నం కోసం పరాయి గుమ్మం తొక్కాల్సిందేనా?**

**కన్నీళ్లు పెట్టిస్తున్న వృద్ధాప్యం.. ఎక్కడికి పోతోంది మానవత్వం?**

**హన్మకొండ, 17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఒకప్పుడు తన బిడ్డ కడుపు నింపడం కోసం తాను పస్తులున్న తల్లి...నేడు తన ఆకలి తీర్చుకోవడం కోసం ఎక్కడో ఒకరి గుమ్మం ముందు నిలబడాల్సిన దుస్థితి వస్తే, అంతకంటే దారుణం మరొకటి ఉంటుందా? పురిటి నొప్పులతో ప్రాణాలతో పోరాడి బిడ్డకు జన్మనిచ్చింది తల్లి. తొమ్మిది నెలలు కడుపులో మోసి, ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి, తన రక్తాన్ని పాలుగా మార్చి బిడ్డకు ప్రాణం పోసింది. బిడ్డ ఆకలితో ఏడిస్తే తన ఆకలిని మరిచిపోయింది. బిడ్డకు కష్టం వస్తే తన కష్టంగా భావించింది. బిడ్డ భవిష్యత్తు బాగుండాలని తన జీవితాన్నే త్యాగం చేసింది. కానీ కాలం మారింది. బిడ్డ పెరిగాడు. తనకంటూ ఒక కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆస్తులు సంపాదించాడు. సొంత ఇల్లు కట్టుకున్నాడు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకున్నాడు. కానీ తనను ఈ స్థాయికి తీసుకురావడానికి త్యాగాలు చేసిన తల్లిదండ్రులను మరిచిపోతే.. ఆ సంపాదనకు అర్థమేంటి?

**నాడు బిడ్డ ఆకలి తీర్చిన తల్లి.. నేడు బువ్వ కోసం ఎదురుచూడాలా?**

ఒకప్పుడు తన బిడ్డకు అన్నం పెట్టడానికి తల్లి ఎన్నో కష్టాలు పడేది. ఇంట్లో సరిపడా తిండి లేకపోయినా, ఉన్న కొద్దిపాటి ఆహారాన్ని బిడ్డకు పెట్టి తాను నీళ్లు తాగి పడుకున్న రోజులు ఎన్నో! బిడ్డకు కొత్త బట్టలు కొనివ్వడానికి తన అవసరాలను పక్కన పెట్టిన సందర్భాలు ఎన్నో! తన బిడ్డకు ఏ కష్టం రాకూడదని జీవితమంతా పోరాడిన తల్లి.. చివరకు వృద్ధాప్యంలో నాలుగు మెతుకుల కోసం ఇతరుల గుమ్మం ముందు నిలబడాల్సి వస్తే, అది కేవలం ఒక తల్లి దుస్థితి మాత్రమే కాదు.. సమాజం ఆలోచించాల్సిన విషాదకరమైన పరిస్థితి.తన బిడ్డ ఆకలితో ఉండకూడదని తపించిన తల్లి.. తాను ఆకలితో ఉన్నప్పుడు తన బిడ్డ గుర్తుకు రాని పరిస్థితి ఎందుకు రావాలి?

**ఈ ప్రశ్న ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకాలి.**

**ఆస్తులు పంచుకునేటప్పుడు కావాలి.. అన్నం పెట్టేటప్పుడు వద్దా?**

తల్లిదండ్రుల ఆస్తులపై హక్కుల కోసం ముందుకొచ్చేవారు, వారి బాధ్యతలను నిర్వర్తించడంలోనూ అదే చొరవ చూపించాలి. తల్లిదండ్రుల కష్టార్జితంతో ఎదిగి, వారి సహకారంతో జీవితంలో స్థిరపడిన తర్వాత వారిని నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం? వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు కావాల్సింది విలాసవంతమైన జీవితం కాదు. సమయానికి ఒక ముద్ద అన్నం, అనారోగ్యంగా ఉన్నప్పుడు మందులు, ఒంటరిగా ఉన్నప్పుడు పలకరింపు, బాధలో ఉన్నప్పుడు ఓదార్పు.. ఇవే వారికి కొండంత అండ. అయితే కొందరు వృద్ధులు కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, నిర్లక్ష్యం వంటి కారణాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొందరికి ఆశ్రయం కరువవుతోంది. మరికొందరు కనీస అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి కుటుంబ పరిస్థితి ఒకేలా ఉండదు. అయినప్పటికీ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల గౌరవం, బాధ్యత, మానవత్వం చూపించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

**రేపు మనకూ వృద్ధాప్యం రాదా?**

ఈరోజు మనం యవ్వనంలో ఉన్నాం.సంపాదించగలుగుతున్నాం. మన పనులు మనం చేసుకోగలుగుతున్నాం. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఈరోజు మనకు అండగా ఉన్న శరీరం రేపు సహకరించకపోవచ్చు. ఈరోజు మనం ఇతరులకు సహాయం చేస్తున్న స్థితిలో ఉండవచ్చు. రేపు మనకే సహాయం అవసరం కావచ్చు. అందుకే తల్లిదండ్రుల పట్ల మన ప్రవర్తనను ఒక్కసారి సమీక్షించుకోవాలి. మన పిల్లలు మనల్ని చూసి నేర్చుకుంటారు. మనం మన తల్లిదండ్రులను ఎలా గౌరవిస్తున్నామో గమనిస్తారు. మనం పెద్దలను నిర్లక్ష్యం చేస్తే, కుటుంబ బాధ్యతల విలువను వారికి ఎలా నేర్పగలం? తల్లిదండ్రులను గౌరవించడం అంటే వారి పాదాలకు నమస్కరించడం మాత్రమే కాదు,వారి ఆకలిని గుర్తించడం, వారి కన్నీళ్లను తుడవడం, వారి వృద్ధాప్యానికి అండగా నిలబడటం కూడా!

**తల్లి ఆకలి తీర్చలేని సంపద ఎందుకు?**

**ఒక్కసారి మీ మనసును ప్రశ్నించుకోండి.**

మీరు చిన్నప్పుడు ఆకలితో ఏడిస్తే అన్నం పెట్టిన తల్లి.. ఈరోజు ఆకలితో ఉన్నప్పుడు మీకు గుర్తుకు రావడం లేదా? మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు రాత్రంతా నిద్రపోకుండా మీ పక్కనే కూర్చున్న తల్లి.. ఈరోజు అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆమె పక్కన కూర్చోవడానికి మీకు సమయం లేదా? మీ భవిష్యత్తు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తల్లి.. వృద్ధాప్యంలో నాలుగు మెతుకుల కోసం ఎక్కడో ఒకరి గుమ్మం ముందు నిలబడాల్సిన పరిస్థితి రావాలా? పురిటి నొప్పులను భరించి జన్మనిచ్చిన తల్లి.. తన బిడ్డ కోసం జీవితమంతా కష్టపడిన తల్లి.. చివరకు బువ్వ కోసం పరాయి గుమ్మం తొక్కాల్సి వస్తే, మనం సాధించిన అభివృద్ధికి అర్థం ఏమిటి? తల్లిదండ్రులు బతికున్నప్పుడే వారి విలువను గుర్తించండి. వారికి అన్నం పెట్టండి. ఆప్యాయంగా మాట్లాడండి. వారి అవసరాలను పట్టించుకోండి. వారి ఆత్మగౌరవాన్ని కాపాడండి. ఎందుకంటే తల్లిదండ్రులకు మనం ఇచ్చే ప్రేమ, గౌరవం, భద్రత కంటే విలువైన బహుమతి మరొకటి లేదు. గుర్తుంచుకోండి.. మనం చిన్నప్పుడు తల్లి చేతిలో ముద్దలు తిన్నాం. ఆమె వృద్ధాప్యంలో మన చేతులతో అన్నం పెట్టడం మన బాధ్యత. తల్లి ఆకలితో ఉన్నప్పుడు మన ఇంటి తలుపులు మూసేస్తే.. మనిషిగా మనం ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది!

– హన్మకొండ శ్రీకాంత్.




# రంగురంగుల వెలుగులు.. దాండియా నృత్యాల సందడి!

**మల్కాజ్‌గిరిలో వైభవంగా హెచ్ఈ ఈవెంట్ దాండియా నైట్**

**ముఖ్య అతిథులుగా జై భీమ్ టీవీ చైర్మన్ డాక్టర్ బరిగెల శివ, రాజా ఇన్‌ఫ్రా అధినేత ఎస్.ఎస్. రాజు**



**మల్కాజ్‌గిరి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

దసరా పండుగ, దేవీ నవరాత్రుల సందర్భంగా మల్కాజ్‌గిరిలో నిర్వహించిన హెచ్ఈ ఈవెంట్ దాండియా నైట్ వేడుకలు అంబరాన్నంటాయి. జస్వంత్ సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సంప్రదాయ నృత్యాలు, సంగీతం, రంగురంగుల అలంకరణలతో ఉత్సాహభరితంగా సాగింది. పండుగ వాతావరణంలో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని దాండియా నృత్యాలతో సందడి చేశారు. ఈ వేడుకలకు జై భీమ్ టీవీ ఛానల్ ఫౌండర్, చైర్మన్, ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ బరిగెల శివ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథుల రాకతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ చేకూరింది.

**సంప్రదాయానికి ప్రతీకగా దాండియా నృత్యాలు**

దేవీ నవరాత్రుల ప్రత్యేకతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ వేడుకల్లో దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్న యువతీ యువకులు సంగీతానికి అనుగుణంగా అడుగులు వేస్తూ సందడి చేశారు. పాటలు, నృత్యాలతో కార్యక్రమ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి వేడుకల్లో పాల్గొంటూ ఆనందాన్ని పంచుకున్నారు. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతలో సాంస్కృతిక కళల పట్ల ఆసక్తిని పెంచుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. పండుగల సందర్భంగా అందరూ ఒకచోట చేరి సంప్రదాయాలను ఆచరించడం సామాజిక అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.

**ఉత్సాహంగా సాగిన వేడుకలు**

జస్వంత్ సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా నైట్ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. సంగీతం, నృత్యాలు, పండుగ సందడితో పాల్గొన్న వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. దేవీ నవరాత్రుల వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సంప్రదాయం, సంస్కృతి, వినోదాన్ని మేళవిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

**ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన**

**విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి**

**రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్**

**గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత**

**వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి

**బి జె వై ఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండె డిమాండ్**

**గన్ పార్క్ వద్ద బీజేవైఎం భారీ నిరసన**

**హైద్రాబాద్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గన్ పార్క్ వద్ద బీజేవైఎం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కాశర్యక్రమానికి పెద్ద ఎత్తున బీజేవైఎం నేతలు,కార్యకర్తలు హాజరైన్నారు. ఈ సందర్భంగా గణేష్ కుండెమాట్లాడుతూరాహుల్ గాంధీ పప్పు గాంధీ ఆయన హైద్రాబాద్ వస్తె యువత చెప్పుల దండ వేస్తారన్నారు. రాహుల్ గాంధీ దిల్లీలో ధర్నాలు కాదు ఇక్కడికి వచ్చి మాట్లాడు..తెలంగాణ లో ఉన్న మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించు...ద్వంద వైఖరి చేయకండి ..ఎంఎల్సీ ఎన్నికలకు వెళ్లే ముందు మీ హామీలు గురించి చెప్పండి..మీరు ఇచ్చిన హామీలు అమలు అయ్యేదాకా..ఃఏజఓ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. 4000 వేల నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి .జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి .గణేష్ కుండె డిమాండ్ చేశారు. లేకపోతే యువత మిమ్మల్ని తరిమి కొడుతుందని హెచ్చరించారు. హామీలు అమలు చేయకుండా ఎమ్మెల్సీ ఓట్లు ఎలా అడుగుతారని గణేష్ కుండె ప్రశ్నించారు.

## ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

**వరంగల్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా తేదీ 20-10-2026 మధ్యాహ్నం 03:00 గంటల నుండి తేదీ 21-10-2026 ఉదయం 03:00 గంటల వరకు ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. **ట్రాఫిక్ మళ్లింపులు :** ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నెలు క్రాస్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లవలెను. -- కరీంనగర్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను. -- హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నెలు క్రాస్ మీదుగా వెళ్లాలి.

**ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు**

సందర్శకుల సౌకర్యార్థం క్రింది ప్రదేశాలలో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసారు. – హన్మకొండ హంటర్ రోడ్ నుండి వచ్చే వాహనాలు: కొలంబో హాస్పిటల్, బీఆర్ నగర్ ఎదురుగా గల గానుగ ఆయిల్ పాయింట్ వద్ద, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్ మరియు జేఎస్ఎం స్కూల్ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. – కడిపికొండ నుండి వచ్చే వాహనాలు: భారత్ పెట్రోల్ పంపు వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.– ఆర్టీఓ జంక్షన్ నుండి వచ్చే వాహనాలు: లష్మీ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో, తాళ్ల పద్మావతి కాలేజీ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. – కరీమాబాద్ నుండి వచ్చే వాహనాలు: భీరన్న గుడి వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. ప్రజలు, సందర్శకులు ట్రాఫిక్ మళ్లింపులను పాటిస్తూ, తమ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలిపి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేసారు.

# అవయవదాతల కుటుంబాలకు భరోసా ఎప్పుడు?

**జీవో 124 అమలుపై పర్యవేక్షణ చేపట్టాలి**

**ఆర్థిక సాయం రూ.లక్షకు పెంచాలి.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి**

**తెలంగాణ శరీర అవయవదాతల సంఘం డిమాండ్**



**హైదరాబాద్,17 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

అవయవదాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా జీవో 124ను పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర శరీర అవయవదాతల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. అంత్యక్రియల ఖర్చుల కోసం ప్రస్తుతం అందిస్తున్నట్లు పేర్కొన్న రూ.10 వేల సాయాన్ని రూ.లక్షకు పెంచడంతోపాటు, దాత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ లేదా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసింది. జీవోలోని నిబంధనలు అన్ని జిల్లాల్లో అమలయ్యేలా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. అర్హులైన కుటుంబాలకు ప్రయోజనాలు అందుతున్నాయో లేదో పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. దేహదానం చేయాలనుకునే వారి కోసం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించాలని, ఆన్‌లైన్ నమోదు విధానాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్క రాజ్ కన్నన్, వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయ ప్రతినిధులను కలిసి తమ వినతులను అందజేశారు. అవయవదానం, దేహదానం ద్వారా సమాజానికి సేవ చేసిన వారి కుటుంబాలకు తగిన గుర్తింపు, సహకారం అందించాలని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. జీవో 124 అమలు, ఆర్థిక సాయం పెంపు, ఉద్యోగ అవకాశం, దేహదానానికి ఏకరీతి విధానం వంటి డిమాండ్లపై ప్రభుత్వం తీసుకునే చర్యలను వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు లయన్ డాక్టర్ కాట్రగడ్డ భారతి, ఉపాధ్యక్షురాలు చాపరాల ఇందిర, జాతీయ సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు

**రాయచోటి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**




అన్నమయ్య జిల్లాలోఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 22 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శనివారం తెలిపారు.2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నోటీసుల ప్రక్రియ కూడా అక్టోబర్ 22 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మదనపల్లె మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ప్రమీల తెలిపారు.అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయం నుంచి నామినేషన్ పత్రాలను తీసుకొని, వాటిలోని నిర్ణీత కాలాలను పూర్తి సమాచారంతో నింపి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలని సూచించారు.పూర్తి చేసిన నామినేషన్ పత్రాలను మదనపల్లెలోని దొంతి లేఅవుట్ వద్ద, మున్సిపల్ వాహన పార్కింగ్ సమీపంలో ఉన్న సహాయ ఎన్నికల అథారిటీ నూతన భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో దాఖలు చేయవచ్చని కమిషనర్ ప్రమీల తెలిపారు.అలాగేఅన్నమయ్య జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా మదనపల్లె ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీపతి పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 25 జెడ్పీటీసీ, 25 ఎంపీపీ, 321 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 1,201 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని గురువారం ఉదయం నుంచి సంబంధిత ఎంపీడీవోలకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాశక్తి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి ప్రత్యేక పూజలు**

**కరీంనగర్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆహ్వానం మేరకు ఆయన మహాశక్తి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ ఎమ్మెల్యే కవ్వంపల్లికి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి మహాశక్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, జువ్వాడి మన్మోహన్ రావు, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తమిశెట్టి రాజేష్, రామినేని రమణయ్య, కనకం అశోక్, రాపాక రాజేశ్వర్, కుంభం చిరంజీవి, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మందల సంపత్ రెడ్డి, ముక్కెర సతీష్ కుమార్, ఏ. రామాంజనేయులు, దూలం వీరస్వామి, విశ్వనాథుల వీరకుమార్, గుడాల మహేందర్ ,కంకణాల అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

# అక్రమ పేలుడు పదార్థాలు స్వాధీనం..ఒకరి అరెస్ట్



**కరీంనగర్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ పేలుడు పదార్థాలు కలిగి ఉన్నట్లు గుర్తించి రామడుగు మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన వేముల భూమయ్య ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి 475 జిలెటిన్ స్టిక్స్, సుమారు 3,000 మీటర్ల డిటోనేటింగ్ వైర్ 3 బండిళ్లు,రెండు కంప్రెసర్ ట్రాక్టర్లు నంబర్లు: ఝా 02 జఅ 2690, ుఉ 02 ు 0082 స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, కంప్రెసర్ ట్రాక్టర్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సైదాపూర్ పోలీసులకు అప్పగించారు.

# తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత..

**యాసంగిలో వరి సాగు చేయవద్దు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి స్పెషల్ చీఫ్ సెక్రటరీ బెనహుర్ మహేష్ దత్ ఎక్కా**




**కరీంనగర్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్, సాగునీటి అవసరాలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ యాసంగి సీజన్‌లో వరి సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కా అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రానున్న పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు చిత్ర మిశ్రా, బి. సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, గరీమ అగర్వాల్ లతో కలిసి ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కా సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఉన్నత అధికారులు వ్యవసాయం, విద్యుత్, నీటిపారుదల, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, నీటి సంరక్షణ, ఉపాధి హామీ, మున్సిపాలిటీల్లో అమృత్ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా వివరాలు సమర్పించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బెన్హా హుర్ మహేష్ దత్ ఎక్కామాట్లాడుతూ. సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో వచ్చే ఏడాది ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, కొత్తగా నీటి ప్రవాహాలు లేని పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల బోరు బావులు ఉండగా, వాటిలో 5 నుంచి 6 లక్షల వరకు పనిచేయని పరిస్థితి ఉందని, భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయని తెలిపారు.యాసంగి సీజన్‌లో వరి సాగుకు నీటి లభ్యత ఉండే అవకాశం లేనందున రైతులను వరి సాగు నుంచి దూరంగా ఉంచేందుకు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా ఉండాలని, తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని ఆదేశించారు.ఆయిల్ పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి పంటలను ప్రోత్సహించాలని, కోతులు, ఇతర సమస్యలు లేని ప్రాంతాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, పంటల అవసరాలను వివరించాలని తెలిపారు. రైతులు నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా సాగు చేసి నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.ఈ సమీక్షలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, అదనపు కలెక్టర్ అశ్విని తానజీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల వ్యవసాయ, సాగునీటి, విద్యుత్, మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, మార్కెటింగ్, పశుసంవర్ధక, మున్సిపల్ శాఖల అధికారులు, ఇతర సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపుకు చిట్వేలి ఎన్సీసీ విద్యార్థులు



**చిట్వేలి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సీసి ట్రూప్ విద్యార్థులు చెంజి అక్షయ , గోర్ల వైష్ణవి, ఆవుల రమ్య కేరళం రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కేరళం రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా కులమావు ప్రాంతంలో ఈ ట్రెక్కింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి ట్రెక్కింగ్ శిబిరంలో కేరళ, లక్షద్వీప్, కర్ణాటక గోవా, మహారాష్ట్ర, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ప్రాంతాలకు చెందిన ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొంటారని తెలిపారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థుల్లో సాహసోపేతమైన ఆలోచనలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జాతీయ సమైక్యతా భావం పెంపొందుతాయనిఅన్నారు. జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

# ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికలు

**రెండో రోజు చైర్మన్ పదవికి మూడు నామినేషన్లు.. వార్డు సభ్యుల స్థానాలకు 75 నామినేషన్లు**



**ఆత్మకూరు, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

ఆత్మకూరు మున్సిపాలిటీలో రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చైర్మన్ పదవికి మూడు నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 75 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ వివరాలను మున్సిపల్ కమిషనర్ ఎస్. బేబీ వెల్లడించారు.చైర్మన్ పదవికి మూడు నామినేషన్లుమున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున డా. గోవింద రాజులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) తరఫున కె. శారదాబాయి, గుజ్జుల రవిబాబు నామినేషన్లు దాఖలు చేశారు.వార్డు సభ్యుల స్థానాలకు 75 నామినేషన్లువార్డు సభ్యుల స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 75 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీ వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.వైఎస్సార్సీపీ: 51టీడీపీ: 16బీజేపీ: 1ఎస్‌డీపీఐ: 1స్వతంత్ర అభ్యర్థులు: 6రెండో రోజు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చైర్మన్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో రాజకీయ సందడి నెలకొంది.

# ప్రతిపక్షంలో ఉన్నా అధికారం ఉన్నట్లు విర్రవీగితే సహించేది లేదు

**వైసీపీకి ఇంకా అధికార మత్తు దిగలేదు..**

**ప్రతిపక్షంలో ఉన్నా రౌడీయిజం చేస్తామంటే సహించేది లేదు**

**తిరుపతి ప్రెస్ క్లబ్ లో తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పులివర్తి నాని,మురళీ మోహన్ హెచ్చరిక**



**తిరుపతి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

ప్రజలు తిరస్కరించి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా వైసీపీ నాయకులు ఇంకా అధికార మదం తోనే వ్యవహరిస్తున్నారని తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. × తిరుపతి ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు సంయుక్తంగా మాట్లాడారు.× ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ:గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు పాల్పడిన అరాచకాలు, భయోత్పాతాలే నిన్నటి పుంగనూరు ఘటనకు మూలకారణమని నేతలు స్పష్టం చేశారు.× ఓటమి భయంతో ఎన్నికల వేళ హింసాత్మక రాజకీయాలు చేసిన వైసీపీ నాయకులు, నేటికీ అదే అరాచక వైఖరిని కొనసాగించాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు.× ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చి అధికారం నుంచి దించినప్పటికీ, ఎల్లకాలం తామే అధికారంలో ఉన్నామనే భ్రమల్లో వైసీపీ నేతలు బతుకుతున్నారని ఎద్దేవా చేశారు.× అధికారం పోయినా అరాచక బుద్ధి పోలేదని, సమాజంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.× ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ దాడులు, దౌర్జన్యాలకు తెగబడటం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. × గత ఐదేళ్ల అరాచక పాలన ముగిసిపోయిందనే వాస్తవాన్ని వైసీపీ నాయకులు ఇప్పటికైనా గుర్తించాలని హితవు పలికారు.× కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.× పులివర్తి నాని గారు మాట్లాడుతూ: రాష్ట్రంలో కొలువుదీరిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం పూర్తిగా నిష్పక్షపాత ప్రభుత్వమని నేతలు స్పష్టం చేశారు. × కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధ పాలన కొనసాగుతుందని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.× పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ మాట్లాడుతూ:కూటమి ప్రభుత్వంలో ఇలాంటి దౌర్జన్యాలు, హింసాత్మక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, వైసీపీ నాయకులు తక్షణమే తమ పద్ధతి మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించారు. × ప్రజా శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, దోషులను చట్టపరంగా శిక్షిస్తుందని తేల్చిచెప్పారు.

# కోహెడలో అసలేం జరుగుతోంది?

**వారసంత లేని రోజున తైబజార్ వసూళ్లకు ఎవరు అనుమతిచ్చారు**
**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం**

**కోహెడ, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

కోహెడ మండల కేంద్రంలో పూర్వీకుల కాలం నుంచి ప్రతి ఆదివారం వారసంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, అలాంటి చోట శనివారం రోజున కూడా వారసంత పేరుతో పూల దుకాణాల వద్ద తైబజార్ డబ్బులు వసూలు చేయడం ఏమిటని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం ప్రశ్నించారు.వారసంత నిర్వహించని రోజున వ్యాపారుల నుంచి తైబజార్ రుసుములు వసూలు చేయడానికి ఎవరు ఆదేశాలు ఇచ్చారు? కాంట్రాక్టర్‌కు ఏ నిబంధనల ప్రకారం ఈ అధికారం కల్పించారు? ఈ వ్యవహారంపై గ్రామ పంచాయతీ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ నిబంధనలకు, కాంట్రాక్టు ఒప్పందంలోని షరతులకు విరుద్ధంగా వసూళ్లు జరిగాయి అనుమతి లేని రోజున వసూళ్లు చేసారు కాబట్టి సదరు కాంట్రాక్టుపై చర్యలు తీసుకోవడంతో పాటు, కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారువసూళ్ల వెనుక ఎవరి ప్రమేయం ఉంది?వారసంత లేని రోజున కూడా తైబజార్ వసూళ్లు చేయడానికి బాధ్యులెవరు, ఈ వసూళ్లకు ఎవరు సహకరించారు,వసూలైన డబ్బులు ఎవరికి చేరుతున్నాయి? ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత ఉందనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఖమ్మం వేంకటేశం డిమాండ్ చేశారు.ఈ అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతులు, చిరు వ్యాపారుల కష్టార్జితాన్ని ఇష్టానుసారంగా వసూలు చేసేందుకు ఎవరికి అధికారం లేదన్నారు.





# మెడికల్ సీటు సాధించిన థెరిసా కళాశాల విద్యార్థిని షేక్ సఫియా




**ఆత్మకూరు, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

ఆత్మకూరు పట్టణంలోని థెరిసా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థిని షేక్ సఫియా మెడికల్ సీటు సాధించింది. శనివారం విడుదలైన ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో కడప ఫాతిమా మెడికల్ కళాశాలలో సీటు పొందినట్లు ఎస్‌వీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ బి.జి. వసుంధర, థెరిసా కళాశాల డైరెక్టర్ సాయి ప్రణీత్ తెలిపారు.ఆత్మకూరు పట్టణానికి చెందిన షేక్ చాంద్ బాషా, షేక్ మహబూనిస దంపతుల కుమార్తె షేక్ సఫియా మెడికల్ సీటు సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి మెడికల్ సీటు సాధించడం విద్యార్థిని కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థిని షేక్ సఫియా సాధించిన ఈ విజయంతో కళాశాలకు మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.షేక్ సఫియా మెడికల్ సీటు సాధించడంతో తోటి విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

# తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ రిజర్వ్ బిసి మహిళకు కేటాయింపు

**జంగాలపల్లి వాస్తవ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించిన దారపనేని**

**కనిగిరి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు అయిన సందర్భంగా జంగాలపల్లి గ్రామస్తులతో శనివారం సమీక్ష సమావేశంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా ఉత్సాహం చూపుతున్న మానం మల్లికార్జున రావు, బొడ్డు వెంకటేశ్వరరావు మాకు ఒక్క అవకాశం ఇవ్వమని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. దానికి దారపనేని స్పందిస్తూ ప్రియతమ నాయకులు, ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కు విన్నవించి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర ఆదేశాలను మనమందరం కలిసి ఆచరిద్దాం అని దారపనేని పేర్కొన్నారు. మానం మల్లికార్జునరావు, బొడ్డు వెంకటేశ్వరరావు ఇద్దరు కుటుంబ సభ్యులే అని శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర ఎవరిని ప్రతిపాదించిన అందరం కలిసికట్టుగా వారిని గెలిపిస్తామని సమీక్షా సమావేశంలో ప్రకటించారు. ఈ సమీక్ష సమావేశంలో తూర్పు కోడిగుడ్లపాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దారపనేని రాజేంద్రప్రసాద్, పోతవరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మిరియం సుబ్బరాయుడు, తిరివీధి చంద్ర, మక్కా నాగరాజు, బొడ్డు రవి, బొడ్డు దానమయ్య, బొడ్డు సుధాకర్, చెనికల మల్లికార్జున, బొడ్డు పెద్దదానమయ్య, బొడ్డు వినోద్, బొడ్డు తిరుపతిరావు, నాగం నాగరాజు, మానం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.



# ఐ హేట్ మ్యారేజ్ ‘ సినిమా టీజర్ విడుదల

సుగి విజయ్, జుప్సీ భద్ర (తొలి పరిచయం) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘ఐ హేట్ మ్యారేజ్ ‘ ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ‘అప్పుడే పెళ్లా’ అనే లిరికల్ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. కాగా తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ‘ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి ఉవని జి తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం.జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో కనిపించనుంది. ప్రతి యువత ఈ సినిమాలో క్యారెక్టర్స్‌తో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు కొత్త అనుభూతినిచ్చే ఫ్రెష్ కంటెంట్ మా చిత్రంలో వుంది’ అన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి,ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్,బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ నటి ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

# ఆత్మకూరు టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ గోవిందరాజులు నామినేషన్ దాఖలు




**ఆత్మకూరు, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజు ఆత్మకూరు టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ గోవిందరాజులు నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ.. తనకు చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆత్మకూరు పట్టణ ప్రజలందరూ తనకు సహకరించి, ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రజల మద్దతుతో చైర్మన్‌గా ఎన్నికైతే పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజాసేవకు అంకితమవుతానని తెలిపారు.

# భార్యను హత్య చేసిన నిందితుడు అరెస్ట్

**మదనపల్లె, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**




రాజ్ భవన్ లాడ్జిలో 15న జరిగిన హత్య కేసులో నిందితుడు నవీద్ బాషా (30)ను అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్, ఎస్సై రహిముల్లా తెలిపారు. కర్ణాటక ములబాగల్‌కు చెందిన మెకానిక్ నవీద్‌కు, మృతురాలు రుబియా తాజ్‌తో 2014లో వివాహమైంది. వీరికి నలుగురు పిల్లలు. భార్యపై అనుమానంతో 14న ఆమెను మదనపల్లెకు తీసుకొచ్చి లాడ్జిలో దిగిన అతడు, 15న తెల్లవారుజామున బీరు సీసాతో దాడి చేసి గొంతు కోసి హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు వాహనం స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# పండుగల నేపథ్యంలో ఆర్టీసీ సేవలు

**ప్రత్యేక బస్సుల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ నియంత్రణ, ఇతర ఏర్పాట్లపై మంత్రి పొన్నం సమీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మంత్రిపొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పండుగల నేపథ్యంలో ఆర్టీసీ చేపట్టిన ప్రత్యేక బస్సుల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ నియంత్రణ, ఇతర ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నాను. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, రీజినల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను మంత్రి శనివారం సమీక్షించారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఈ మూడు రోజులు బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, రద్దీకి అనుగుణంగా అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచాలని సూచించాను. ఏయే మార్గాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందో ఎప్పటికప్పుడు గుర్తించి, ఆయా రూట్లలో అదనపు బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రత్యేక బస్సుల నిర్వహణ చేపట్టాం. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే బస్టేషన్లలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, బస్సుల లభ్యత, రాకపోకల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బస్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుధ్యం, భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశాను. ప్రయాణికుల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించాలని, రద్దీ నియంత్రణలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దసరా పండుగ ముగిసిన అనంతరం ప్రయాణికులు ఒకేసారి తిరుగు ప్రయాణం చేసే అవకాశం ఉన్నందున, రద్దీని ముందుగానే అంచనా వేసి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండే పరిస్థితులు రాకుండా అవసరమైన మార్గాల్లో అదనపు బస్సులను సిద్ధంగా ఉంచాలని సూచించాను. ఆర్టీసీ ఎండీ నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు అందరూ అప్రమత్తంగా ఉండి, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకునేందుకు సొంత ఊళ్లకు వెళ్తున్న నేపథ్యంలో, వారి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఆర్టీసీ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

# మున్సిపల్ చైర్మన్ వైసిపి అభ్యర్థిగా పులి శాంతి నామినేషన్

**కనిగిరి, అక్టోబర్ 17 (జై భీమ్ న్యూస్) :**




కనిగిరి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పులి శాంతి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదేన్న, చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు. నామినేషన్‌కు పులి శాంతి నివాసం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్‌తో పాటు 32 వార్డుల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పులి శాంతి మాట్లాడుతూ గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో ప్రజలకు సేవ చేసేందుకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ స్థాయిల ప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అంతరిక్షం వైపు పల్లెటూరి అమ్మాయి




**దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' టీజర్ విడుదల**

**సైన్స్ ఫిక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం**

**దర్శకుడిగా పవన్ సాధినేని**

**కీలక పాత్రలో శ్రుతిహాసన్**

**సంగీతం అందిస్తున్న జీవీ ప్రకాశ్ కుమార్**

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పవన్ సాధినేని దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చదువుపై మక్కువతో ఓ పల్లెటూరి అమ్మాయి అంతరిక్షం వైపు సాగించే అద్భుత ప్రయాణాన్ని ఇందులో భావోద్వేగభరితంగా ఆవిష్కరించారు. ఆకట్టుకునే విజువల్స్, మనసును హత్తుకునే సన్నివేశాలతో టీజర్‌ను తీర్చిదిద్దారు. 'ఆమె కల.. అతడి నమ్మకం.. ఇది వారిద్దరి ప్రయాణం' అనే క్యాప్షన్ కథలోని భావోద్వేగాలను ప్రతిబింబిస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు జోడీగా సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నటి శ్రుతిహాసన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ అందిస్తున్న సంగీతం టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ విడుదలతో చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి.



## ఏఐ ఫొటోలు తొలగించండి: నేహా శర్మ

హైదరాబాద్, అక్టోబర్ 17: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో తన ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా సృష్టించి వినియోగిస్తున్న వారిపై బాలీవుడ్ నటి నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే పోస్ట్ చేసిన ఏఐ ఇమేజ్‌లు, వీడియోలను వెంటనే తొలగించాలని, తన ఫొటోలు లేదా పోలికలతో కొత్తగా కంటెంట్ సృష్టించడం, ఎడిట్ చేయడం, ప్రచారం చేయడం నిలిపివేయాలని తన ఎక్స్ ఖాతా ద్వారా హెచ్చరించారు. తన ముఖాన్ని ఉపయోగించి తప్పుగా చిత్రీకరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, అనధికార వినియోగానికి తాను అంగీకరించబోనని స్పష్టం చేశారు. ఈ ప్రకటనను అధికారిక హెచ్చరికగా పరిగణించాలని, ఇలాంటి కంటెంట్‌ను సృష్టించినా, పోస్ట్ చేసినా, ఇతరులకు పంపిణీ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. నకిలీ ఖాతాలు లేదా ఏఐ సాంకేతికత వెనుక దాక్కున్నా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'జనవరి 12 విడుదల'లో కీర్తి పాత్ర ఇదే!



**కీర్తి సురేశ్ పాత్ర పేరు 'లతా రెడ్డి'**

**పుట్టినరోజు సందర్భంగా కీలక అప్‌డేట్ ఇచ్చిన అనిల్ రావిపూడి**

**వెంకటేశ్‌కు జోడీగా కీర్తి.. కల్యాణ్‌రామ్ సరసన కృతి శెట్టి**

**ఊటీలో కొనసాగుతున్న సినిమా షూటింగ్**

**2027 సంక్రాంతికి జనవరి 12న విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యం**

**హైదరాబాద్, అక్టోబర్ 17:**

విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'జనవరి 12 విడుదల'లో కీర్తి సురేశ్ పోషిస్తున్న పాత్ర పేరును తాజాగా వెల్లడించారు. అక్టోబర్ 17న కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన అనిల్ రావిపూడి.. ఈ సినిమాలో ఆమె 'లతా రెడ్డి'గా కనిపించనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. కీర్తి సురేశ్‌లోని ప్రత్యేకమైన ఉత్సాహం, ఆప్యాయత, సహజమైన నటన 'లతా రెడ్డి' పాత్రకు మరింత అందాన్ని తీసుకొస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటనతో సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్‌రామ్ సరసన కృతి శెట్టి కనిపించనున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా సాగుతోంది. ఇటీవలే తమిళనాడులోని ఊటీలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించారు. అంతకుముందు మైసూరులో చిత్రీకరణ జరిపారు. అక్కడ నలుగురు ప్రధాన నటీనటులపై కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను కూడా తెరకెక్కించినట్లు సమాచారం. ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆమె కొరియోగ్రఫీలో దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత భాగం కావడం ఆనందంగా ఉందని నటుడు శ్రీమాన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల ఆయన సినీ ప్రయాణంలో 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. భారత సైన్యంలో పనిచేసే అధికారి, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, బందీలను విడిపించే చర్చల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తిగా వెంకటేశ్ పాత్రను పరిచయం చేశారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమాను సురేశ్ ప్రొడక్షన్స్ అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

# 'జైలర్ 2'కు భారీ వసూళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 17 :**

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల వసూళ్ల మైలురాయిని దాటినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడించాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇప్పటివరకు రూ.209.10 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు సమాచారం. అయితే రెండో రోజు దేశీయ వసూళ్లు తొలి రోజుతో పోలిస్తే తగ్గడం గమనార్హం. అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం రెండో రోజైన శుక్రవారం భారత్‌లో రూ.35.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. దీంతో తొలి రెండు రోజుల్లో దేశీయ నెట్ కలెక్షన్లు రూ.95.30 కోట్లకు చేరాయి. దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.112.10 కోట్లు కాగా, విదేశాల్లో రూ.97 కోట్ల ఆదాయం వచ్చినట్లు సాక్‌నిల్క్ గణాంకాలు పేర్కొన్నాయి. తొలి రోజు రూ.59.70 కోట్ల నెట్ వసూళ్లు నమోదు కాగా, రెండో రోజు కలెక్షన్లలో 40.4 శాతం తగ్గుదల కనిపించింది. ప్రాంతీయ భాషల వసూళ్లలో తమిళ వెర్షన్ ఆధిపత్యం కొనసాగించింది. రెండో రోజు 7,243 షోల ద్వారా రూ.25.25 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. తెలుగు వెర్షన్ 1,940 షోల ద్వారా రూ.7.25 కోట్లు రాబట్టగా, హిందీ వెర్షన్ రూ.2.75 కోట్లు, కన్నడ వెర్షన్ రూ.35 లక్షలు వసూలు చేశాయి. రెండో రోజు సినిమా ప్రదర్శనల్లో మొత్తం ఆక్యుపెన్సీ 48.2 శాతంగా నమోదైంది. తమిళ వెర్షన్‌కు రాత్రి షోల్లో 85.92 శాతం ఆక్యుపెన్సీ లభించింది. రెండో రోజు 23.83 లక్షల మంది సినిమాను వీక్షించగా, తొలి రెండు రోజుల్లో ప్రేక్షకుల సంఖ్య 61.30 లక్షలకు చేరింది. దీంతో వారాంతంలో సినిమా వసూళ్లు ఏ స్థాయికి చేరుకుంటాయన్న ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ తమ పాత్రల్లో తిరిగి నటించగా, విద్యాబాలన్, రమ్యకృష్ణన్, ఎస్.జె. సూర్య, మిథున్ చక్రవర్తి తదితరులు కీలక పాత్రలు పోషించారు. హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రలో కనిపించగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.